

రూ.లక్ష విరాళం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలోని నిత్య అన్నదాన పథకానికి కృష్ణా జిల్లాకు చెందిన వేలంకి సీతారామరాజు శనివారం రూ.1,00,007 విరాళంగా అందజేశారు.



మల్లన్నకు ఊయల సేవ

శ్రీశైలం: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఊయల సేవ నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి ఊయలలో ఆశీనులను చేశారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

కుక్క పిల్లలను తీసుకురావడానికి వెళ్లిన తొమ్మిదేళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన చిన్నతుంబళం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది.

వివరాలు 10లో ▸



న్యూస్‌రీల్

సమ్మోహనం.. జగన్మోహిని రూపం



మోహినీ అలంకరణలో నృసింహస్వామి

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎగువ అహోబిలంలో సింహరూపుడైన లక్ష్మీనృసింహస్వామి జగన్మోహినీ అలంకరణతో భక్తులను కనువిందు చేశారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేలుకొలిపి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామిని యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన గావించారు. ప్రహ్లాదవరదుడిని నూతన పట్టుపీతాంబరాలతో మోహినీగా అలంకరించి పల్లకీలో కొలువుంచి భక్తుల గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య తిరుమాడవీధుల్లో ఊరేగించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని శుక్రవారం ఇంటర్ విద్య జిల్లా అధికారిణి సునీత తెలిపారు. ఈనెల 22వ తేదీలోగా సంబంధిత కళాశాలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. నెలాఖరులోగా తొలి విడత ప్రవేశాలను ముగించి వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చేనెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 57 ప్రైవేటు కళాశాలలు, 90 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయన్నారు. గత ఏడాది మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ కోర్సుల్లో 12,287 మందికి ప్రవేశాలు జరిగాయని, ఈ ఏడాది పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగిన నేపథ్యంలో కనీసం 15 వేలు తగ్గకుండా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

పచ్చి మిర్చి @ 90

నంద్యాల(సెంట్రల్): పచ్చి మిర్చి ధర అమాంతం పెరిగింది. రెండు నెలల క్రితం కిలో రూ.45 ఉన్న పచ్చి మిర్చి ధర పది రోజుల క్రితం రూ.60కి చేరింది. శుక్రవారం నాటికి ఏకంగా రూ.90 చేరింది. దీంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. వేసవి కావడంతో సాగు తక్కువగా ఉండడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా స్థానిక శ్రీనివాస్ నగర్, టెక్కే రైతు బజారులో కిలో రూ.84 అమ్ముతున్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా ఉన్నాయి. శుక్రవారం సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.17,500, మధ్యస్థ ధర రూ.13,000, కనిష్ట ధర రూ.9,500 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,500, మధ్యస్థ ధర రూ.5,600, కనిష్ట ధర రూ.5,000 గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలోని 69 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న గణితం, పీఎస్, కెమిస్ట్రీ సబ్జెక్టు ఉపాధ్యాయులకు మొదటగా ఈనెల 17, 18 తేదీల్లో, సోషల్, బయాలజికల్ సైన్స్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఈనెల 20, 21 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో పని చేసే ప్రతి ఒక్క సబ్జెక్టు ఉపాధ్యాయుడు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బేగ్, కర్నూలు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఎంఈఓలు అబ్దుల్‌కరీం, సురేంద్రనాథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, కస్తూర్బాగాంధీ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, హైస్కూల్ హెచ్ఎంలు పాల్గొన్నారు.



ఆర్‌బీకేలకు తరలించేందుకు సిద్ధం చేసిన వేరుశనగ విత్తనకాయల ప్యాకెట్లు

ముందస్తు వర్షం.. వేరుశనగ సిద్ధం



వేరుశనగ విత్తన కాయల ప్యాకింగ్

ఈ నెల 20 నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్‌లు

- ఉమ్మడి జిల్లాకు 16,379 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు
- కర్నూలు జిల్లాకు 13,929, నంద్యాల జిల్లాకు 2,450 క్వింటాళ్లు
- పత్తికొండ సబ్ డివిజన్‌కు అత్యధికంగా 9,184 క్వింటాళ్లు
- వేరుశనగ కిలో ధర రూ.95, సబ్సిడీ 40 శాతం
- రైతులు చెల్లించాల్సిన ధర రూ.57
- 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): ముందస్తు వర్షాల నేపథ్యంలో విత్తనం సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసే పంటల్లో ప్రధానమైంది వేరుశనగ. సాధారణ సాగు 4,19,219 హెక్టార్లు. ముందస్తు వర్షాల నేపథ్యంలో రైతులు విత్తనాన్ని సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. అయితే గత ఏడాది ఖరీఫ్‌లో పంపిణీ చేసిన వేరుశనగ కంటే ఈసారి తక్కువ కేటాయించడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రితో చర్చించకుండానే ఏకపక్షంగా వేరుశనగ కేటాయించినట్లు తెలుస్తోంది. మామూలుగా గత ఏడాది పంపిణీని పరిగణనలోకి తీసుకొని కేటాయింపులు చేపడతారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ 15,350 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ జరిగింది. ఈ సారి ముందస్తు వర్షాలు పడుతుండటం, రానున్న రోజుల్లో కూడా విస్తరంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వేరుశనగకు డిమాండ్ ఏర్పడింది. ఈ సారి ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు 58,969 హెక్టార్లు ఉండగా.. కర్నూలు జిల్లాకు 13,929 క్వింటాళ్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. జిల్లాకు మరో 5వేల క్వింటాళ్లు కేటాయించాలని జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపినా వ్యవసాయ శాఖ నుంచి స్పందన కరువైంది. వేరుశనగ, పచ్చిరొట్ట ఎరువుల ధరలు, సబ్సిడీలు ఖరారు కావడంతో పంపిణీకి వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేస్తోంది.

ముమ్మరంగా సాగుతున్న ప్రాసెసింగ్

రైతులకు సకాలంలో విత్తనం అందించే లక్ష్యంతో ఏపీసీడ్స్ ఆర్‌బీకేల వారీగా వేరుశనగ విత్తన కాయలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రైతులకు నాణ్యమైన వేరుశనగ అందించేందుకు ప్రాసెసింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. కర్నూలులోని ఏపీసీడ్స్ ఉమ్మడి కర్నూలు జిల్లాకు విత్తనాలు సరఫరా చేస్తోంది. ప్రయోగశాలల్లో నాణ్యతను నిర్ధారించిన వేరుశనగను రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 20 నుంచి సబ్సిడీ విత్తనాల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. 20 తర్వాత ఏ రోజు నుంచైనా పంపిణీకి వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ సిద్ధంగా ఉన్నాయి.



కృష్ణగిరి మండలం బాపనదొడ్డి గ్రామంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

16,379 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

ఉమ్మడి కర్నూలు జిల్లాకు 16,379 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించింది. కర్నూలు జిల్లాకు 13,929 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 2,450 క్వింటాళ్ల ప్రకారం కేటాయింపులు చేపట్టారు. గత ఏడాది పంపిణీ అయిన వేరుశనగతో పోలిస్తే తక్కువే కేటాయించినప్పటికీ డిమాండ్‌ను బట్టి అదనంగా కేటాయించే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. జూన్ 1 నుంచి ఖరీఫ్ మొదలవుతుంది. ఈ సారి ముందస్తుగా వర్షాలు పడుతున్నందున ముందస్తుగానే వేరుశనగ వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ సారి కొత్తగా టీసీజీఎస్ 1694 వేరుశనగ రకాన్ని సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. జిల్లాకు కేటాయించిన వేరుశనగలో కే-6 రకం 11,974, టీసీజీఎస్ 1694 రకం 1,250, కదిరి లేపాక్షి రకం 750 క్వింటాళ్లు కేటాయించింది.

50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు

వరి సాగు చేసే ప్రాంతాల్లో పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలకు డిమాండ్ ఉంటుంది. పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలైన జీలుగ, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. జిల్లాకు జీలుగ 197 క్వింటాళ్లు, పిల్లి పెసర 25 క్వింటాళ్లు కేటాయించింది. జీలుగ విత్తనాలు కిలో ధర రూ.88 ఉండగా.. సబ్సిడీ పోను రూ.44 చెల్లించాల్సి ఉంది. పిల్లి పెసర కిలో ధర రూ.134 ఉండగా.. సబ్సిడీ పోను రైతులు రూ.67 చెల్లించాలి.

- కర్నూలు జిల్లాలోని పత్తికొండ సబ్ డివిజన్‌లో 6 మండలాలు ఉండగా.. 9,184 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. కర్నూలు సబ్ డివిజన్‌కు 800, ఆదోని సబ్ డివిజన్‌కు 1,570, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు 505, ఆలూరు సబ్ డివిజన్‌కు 1,870 క్వింటాళ్ల ప్రకారం కేటాయించారు.
- నంద్యాల జిల్లాలోని డోన్ సబ్ డివిజన్‌లో మాత్రమే వేరుశనగ సాగు అవుతుంది. ఈ డివిజన్‌కు 2,450 క్వింటాళ్లు కేటాయించారు.

40 శాతం రాయితీపై వేరుశనగ పంపిణీ

జిల్లాకు ఈ సారి మూడు వేరుశనగ రకాలను కేటాయించారు. వేరుశనగ ధర, సబ్సిడీలు కూడా ఖరారు అయ్యాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ గరిష్ట ధర రూ.6,800 నుంచి రూ.7,500 పలుకుతోంది. సగటు ధర రూ.6,699. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తన కాయలను 40 శాతం సబ్సిడీతో ఇస్తోంది. సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగ కిలో ధర రూ.95గా నిర్ణయించారు. ఏపీసీడ్స్‌కు ఎవరైతే వేరుశనగ సరఫరా చేస్తున్నారో ఆ కంపెనీలే ప్రాసెసింగ్ చేసి, 30 కిలోల బ్యాగులు సిద్ధం చేసి ఆర్‌బీకేల వారీగా సరఫరా చేయాల్సి ఉంది. సబ్సిడీ పోను రైతులు కిలోకు రూ.57 చెల్లించాల్సి ఉంది.

ఖరీఫ్ సాధారణ సాగు వివరాలు...

పంట	సాధారణ సాగు (హెక్టార్లలో)
పత్తి	2,43,699
వేరుశనగ	58,969
కంది	25,557
ఆముదం	9,231
మిరప	29,998
ఉల్లి	15,698
వరి	12,771
ఇతర పంటలు	23,306
మొత్తం	4,19,219

నాణ్యతతో పంపిణీ చేస్తాం

వేరుశనగ విత్తన కాయలను నాణ్యతతో పంపిణీ చేయనున్నాం. రెండు జిల్లాలకు సంబంధించి 10వేల క్వింటాళ్లు ప్రాసెసింగ్ చేసి 30 కిలోల బ్యాగ్‌లు కూడా సిద్ధం చేశాము. వర్షాలు పడుతుండటంతో రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా వేరుశనగను అందుబాటులో ఉంచుతాం.

– ధనలక్ష్మి, మేనేజర్, ఏపీసీడ్స్, కర్నూలు, నంద్యాల

కొరత తలెత్తనివ్వం



ఈ సారి ముందస్తుగా వర్షాలు పడుతున్నందున వేరుశనగ సకాలంలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఆర్‌బీకేల ద్వారా విత్తన పంపిణీకి జిల్లా కలెక్టర్ సృజన అనుమతి ఇచ్చారు. ఈ నెల 20 నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చు. ఎలాంటి పరిస్థితుల్లో కొరత తలెత్తనివ్వం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో డీఎంఅండ్‌హెచ్ఓ, డీపీఓ, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమావేశమయ్యారు. వర్షాలు కురుస్తున్నందున తాగు నీరు కలుషితమై ప్రజలకు డయేరియా బారిన పడే ప్రమాదముందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి క్లోరినేషన్‌తో పాటు ట్యాంకులను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. పైపులైన్ల లీకేజీల మరమ్మతులు, పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రామతీర్థం, యర్రగుంట్ల గ్రామాల్లో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, డీపీఓ మంజులవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

18005994599

- ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్

కర్నూలు (న్యూటౌన్): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలపై ఫిర్యాదుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను, మెయిల్ ఐడీని ఏర్పాటు చేసిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీచ్‌ల నుంచి ఇసుకను ఎవరైనా అక్రమంగా తరలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18005994599, మెయిల్ ఐడీ dmgapsandcomplaints@yahoo. comకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాం

- నిరాధారమైన వార్తలు రాయడం తగదు
- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఎన్నికల ప్రక్రియలో జిల్లా పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా విధులు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలకు తావులేకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో పౌరులకు వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి 8,522 మంది అనుమానాస్పద వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, నగదు రవాణాలకు అడ్డుకట్ట వేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 324 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహించి ప్రజలకు శాంతి భద్రతలపై భరోసా కల్పించామన్నారు. జిల్లాలోని అన్ని లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. క్యూఆర్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో ప్రత్యేక గస్తీలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా నిర్వహించారన్నారు. కానీ రెండు రోజులుగా ప్రముఖ దినపత్రిక ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా కథనాలు ప్రచురించడం సమంజసం కాదన్నారు. ప్రజలకు – పోలీసు వ్యవస్థకు వారధిలా ఉండాల్సిన మీడియా.. నిరాధారమైన వార్తలు ప్రచురించడం భావ్యం కాదన్నారు.

శ్రీరస్తు.. ఉచిత విద్యా ప్రాప్తిరస్తు

- పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్య
- ప్రైవేట్, కార్పొరేట్, స్కూళ్లలో విద్యాహక్కు ద్వారా ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్న ప్రభుత్వం
- నిర్బంధ విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు
- ఈ ఏడాది ఉచిత విద్యకు మొదటి విడతలో 960 మంది విద్యార్థులు ఎంపిక
- ఈనెల 20 లోపు పాఠశాలల్లో చేరకుంటే సీటు రద్దు



ఆళ్లగడ్డలో సెంట్‌ఆన్స్ ప్రైవేటు పాఠశాల

ఆళ్లగడ్డ: చదువుకు పేద, పెద్ద అంతరాల్లేవ్.. అడ్డుగోడలు అంతకన్నా ఉండకూడదు.. పేదరికాన్ని పారద్రోలే పెద్ద ఆయుధం విద్య.. అక్షర జ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చు అన్న సంకల్పంతో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు పైసా ఖర్చు లేని ఉచిత విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మొదటి విడతగా జిల్లాలో 960 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారు ఈ నెల 20 తేదీ లోపు అడ్మిషన్లు పొందాలని గడువు విధించింది.

జిల్లాలో 960 మందికి ప్రవేశాలు

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుతో 2024 – 25 విద్యాసంవత్సరానికి పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 247 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలతో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో సుమారు 3 వేల సీట్లు అందుబాటులో ఉండగా మొదటి విడతలో 1,867 మంది పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 960 మంది విద్యార్థులను జిల్లా అడ్మిషన్ మానిటరింగ్ కమిటీ ఎంపిక చేసి జాబితాను విద్యాశాఖ మండల అధికారులకు పంపింది. వీరిలోనూ ఇప్పటికే 600 మంది ప్రవేశం పొందారు. మిగతా వారు ఈ నెల 20వ తేదీలోపు కేటాయించిన పాఠశాలల్లో ప్రవేశం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ సూళ్లన్నింటిలోను 2024 – 25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతర వర్గాలకు 6 శాతం సీట్లు కేటాయించాలి.

అనుమానాల నివృత్తికి 14417 టోల్ ఫ్రీ నంబర్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తు, సీట్లు పొందే అంశాలపై ఏమైనా ఇబ్బందులు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వం 14417 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన గ్రీవెన్స్‌లను సత్వర పరిష్కారం కోసం ఎంఈఓ, డీఈఓ స్థాయిలో ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేశారు.

ఫీజు చెల్లింపు..

ప్రైవేటు పాఠశాలల్లో సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. పట్టణాల్లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100. వీటిని అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది.



కూతురు రక్షితను ఎత్తుకుని ఉన్న ఈమె పేరు స్వర్ణలత. ఆళ్లగడ్డలోని డానియేల్ వీధికి చెందిన ఈమెకు భర్త రాజశేఖర్ ఐదేళ్ల క్రితమే మృతి చెందాడు. కూతురిని కార్పొరేట్ పాఠశాలలో చదివించాలని ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదు. ఈ క్రమంలో పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు కేటాయిస్తున్నారని తెలుసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో తమ ఇంటి సమీపంలోని సెంట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సీటు వచ్చింది. 'మాలాంటి ఎస్సీ నిరుపేదలకు ఇంతటి సాయం చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం' అని ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

మొదటి విడతలో ఎంపికైన విద్యార్థులు

నియోజకవర్గం	ప్రైవేటు పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు
ఆళ్లగడ్డ	26
బనగానపల్లె	78
డోన్	270
నంద్యాల	273
నందికొట్కూరు	206
పాణ్యం	28
శ్రీశైలం	79
మొత్తం	960

చేరకుంటే సీటు రద్దు



జిల్లాలోని ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ఎంపికైన వారిని చేర్చుకోబోమని అడ్మిషన్లు తిరస్కరించినా, ఫీజు చెల్లించాలని వేధించినా కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం 960 మంది విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో సీట్లు కేటాయించారు. ఈ నెల 20వ తేదీ లోపు చేరాలి. లేకపోతే సీటు రద్దు అవుతుంది.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


మహ్మద్‌బాషా

ఆదోని అర్బన్: పట్టణంలోని కునిమొల్లా కాలనీకి చెందిన బండి ఉసేన్ రెండో కుమారుడు మహబూబ్‌బాషా అలియాస్ ఖాసీం తప్పిపోయాడని త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. యువకుడికి మతిస్థిమితం సరిగాలేదని, ఈ నెల 13న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. తల్లిదండ్రులు మూడు రోజుల పాటు వెతికినా ఆచూకీ దొరకలేదన్నారు. వారి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య


లక్ష్మీదేవి (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన వెలగటూరు లక్ష్మీదేవి (35) శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వెలగటూరు వెంకటేశ్వర్లు భార్య లక్ష్మీదేవికి మానసిక స్థితి సరిగా లేదు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రొద్దుటూర్ రైల్వే స్టేషన్ వద్ద విజయవాడ – ధర్మవరం రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందనే సమాచారం అందుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజా రామిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో పొదుపు గ్రూపు సభ్యురాలి పుస్తకం ఉండటంతో వివరాలను స్థానిక పోలీసులకు చేరవేయడంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రొద్దుటూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీసుల అదుపులో ధాన్యం వ్యాపారి

చాగలమర్రి: రైతులు, వ్యాపారుల నుంచి రూ.2.36 కోట్ల నగదును అప్పుగా తీసుకొని తల్లిదండ్రులతో సహా పరారైన ధాన్యం వ్యాపారి టంగుటూరి నిఖిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏప్రిల్ నెల 1వ తేదీన టంగుటూరి నిఖిల్ అతని తల్లిదండ్రులైన సురేష్, శ్రీదేవిలపై చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పరారీలో ఉన్న వీరు తాడిపత్రి పట్టణంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వీరిని చాగలమర్రి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బాధితులు పోలీసు స్టేషన్ వద్దకు గుంపులు గుంపులుగా చేరుకున్నారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ రమణయ్యల ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. నిందితులకు గొడిగనూరు గ్రామంలో రూ.20 లక్షల విలువ చేసే సొంత ఇల్లు ఉన్నట్లు సమాచారం.

తుఫాన్ వాహనం బోల్తా

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తుఫాన్ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గాయాల పాలయ్యారు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు.. రోజు మాదిరిగా కర్నూలు నుంచి లక్ష్మీనారాయణ, శిరీషా, రాధా, రజిని, రమేష్, జ్యోతితో పాటు మరో ఇద్దరు తుఫాన్‌లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు హాజరయ్యేందుకు బయలుదేరారు. తమ్మరాజుపల్లె ఎస్ టర్నింగ్ వద్దకు రాగానే తుఫాన్ వాహనం ఛాసి కట్ కావడంతో డివైడర్‌ను ఢీకొని అదే వేగంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడగా స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దంచికొట్టిన వాన

మండు వేసవిలో వాన దంచికొట్టింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది. వాగులు, వంకలు ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. దుక్కులు దున్ని పొలాలను ఖరీఫ్‌కు సిద్ధం చేసుకునే అవకాశం ఏర్పడింది. బోరుబావుల్లోకి, చెరువుల్లోకి నీరు చేరడంతో నీటి ఎద్దడి సమస్య తీరింది. – సాక్షినెట్‌వర్క్


కోవెలకుంట్ల సమీపంలో వర్షపునీటితో ప్రవహిస్తున్న కుందూనది


దొర్నిపాడు మండలంలో కమ్ముకున్న మేఘాలు


గడివేముల మండలం బిలకలగూడూరులో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు


హొళగుంద మండలం గజ్జహళ్లిలో ప్రవహిస్తున్న పాతప్ప వంక


సి.బెళగల్ మండలం కంబదహాల్‌లో ప్రవహిస్తున్న వంక


గోనెగండ్ల మండలంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు


బనగానపల్లె మండలం చిన్నరాజుపాలెం సమీపంలో నిలిచిన నీరు

శ్రీమఠంలో జిల్లా అదనపు కోర్టు జడ్జి


శ్రీ మఠం ప్రాంగణ వీధుల్లో ప్రదక్షిణ చేస్తున్న జడ్జి భూపాల్ రెడ్డి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై జిల్లా అదనపు కోర్టు జడ్జి జి. భూపాల్ రెడ్డి శుక్రవారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం దివాన్ రాఘవేంద్రుల జ్ఞాపిక, ఫల,పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. చూచిరాతలకు పాల్పడుతుండగా నందికొట్కూరు శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో ముగ్గురు, కర్నూలు సాయికృష్ణ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు సిద్ధార్థ డిగ్రీ కళాశాల, రావూస్ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 7,553 మందికి 6,917 మంది, స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉదయం సెషన్‌లో 10 మందికి 8 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 247 మందికి 225 మంది, బీఈడీ మూడో సెమిస్టర్‌కు 3,322 మంది విద్యార్థులకు 3097 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ కర్నూలులోని ఆర్‌సీ రెడ్డి, శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాలల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు.

జిల్లా పంచాయతీ అధికారి వాహనం బోల్తా

- స్వల్ప గాయాలతో బయట పడిన డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ప్రయాణిస్తున్న బొలేరో వాహనం బోల్తా పడింది. శుక్రవారం ఆయన విధి నిర్వహణలో భాగంగా కర్నూలు నుంచి కోడుమూరు వైపు వెళ్తుండగా, కోడుమూరు మండలం కొత్తూరు గ్రామ సమీపంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో వాహనం ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు, ఆయన సీసీ చరణ్, అటెండర్ దస్తగిరి, డ్రైవర్ శివకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని వెంటనే కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది కర్నూలు విజయ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. స్వల్ప గాయాలకు గురైన వీరందరికి హాస్పిటల్‌లో ఎక్స్‌రేలు తీసి, ప్రాథమిక చికిత్సను అందించారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పారు. సంఘటన సమాచారం తెలిసిన వెంటనే కోడుమూరు ఈఓఆర్‌డీ ఆర్ మంజుల, పలువురు పంచాయతీ కార్యదర్శులు, డీపీఓ కార్యాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాస్పిటల్ వద్దకు చేరుకొని డీపీఓ, సిబ్బందిని పరామర్శించారు.


ప్రమాదానికి గురైన డీపీఓ వాహనం

ఆత్మహత్యను ఆపిన పోలీసులు

- యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగింత

ఆదోని అర్బన్: యువకుడి ఆత్మహత్యను ఆపి, అతడిని పోలీసులు బంధువులకు అప్పగించారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ధనుంజయ అనే యువకుడు ఆదోని పట్టణంలో నివాసముంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన యువకుడు గురువారం రాత్రి తన స్నేహితుడు కుబేర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను చనిపోతున్నాను అని చెప్పి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో వెంటనే కుబేర్‌రెడ్డి కర్నూలు డీఐజీ విజయరావుకు ఫోన్ చేసి విషయాన్ని చెప్పడంతో ఆయన ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామికి తెలియజేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ నరసింహరాజు ఆధ్వర్యంలో నాలుగు పోలీసులు బృందాలు యువకుడి ఆచూకీ కోసం గాలించాయి. చివరి ఫోన్ కాల్ ఆధారంగా యువకుడు ఎక్కడ ఉన్నారో తెలుసుకోగలిగారు. ఆదోని పట్టణశివారులోని ఎమ్మిగనూరు రోడ్డులో 41 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహానికి కొంత దూరంలో బైక్ వదిలి అక్కడ పడుకున్న యువకుడి దగ్గరకు వెళ్లి విచారించారు. అతను ధనుంజయగా గుర్తించి, అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. బంధువులను పిలిపించి యువకుడిని అప్పగించారు. యువకుడిని గురువారం అర్ధరాత్రి వరకు వెతికినట్లు సీఐ చెప్పారు. యువకుడి ఆత్మహత్యను నివారించిన పోలీస్ సిబ్బందికి డీఐజీ, డీయస్పీ అభినందనలు తెలియజేశారు.


ధనుంజయ (వృత్తంలో ఉన్న వ్యక్తి)

కొనసాగుతున్న వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్: అతిసార వ్యాధి ప్రబలిన రామతీర్థం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. శుక్రవారం వైద్యశిబిరాన్ని జిల్లా ఎఫ్‌డీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్‌రెడ్డి, డీపీఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ సునీత, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక ఇతర వైద్య సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. మరోవైపు గ్రామానికి కుళాయిల నుంచి వచ్చే నీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు. గ్రామ శివారు ప్రాంతంలో ఉండే ఓ రైతుకు చెందిన బోరులో నీటిని పరీక్షించి, అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఏఈ సాయికృష్ణ.. సర్పంచ్ సురేష్‌నాయుడు పర్యవేక్షణలో నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాగా వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న చిన్నారి సుహానను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్లారు.


వైద్యశిబిరంలో రోగులకు చికిత్స అందిస్తున్న ఎఫ్‌డీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్‌రెడ్డి

బాలుడి ప్రాణం తీసిన విద్యుదాఘాతం

- కుక్క పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్లగా దుర్ఘటన


మృతిచెందిన శివ (ఫైల్)

పెద్దకడబూరు: విద్యుదాఘాతానికి గురై తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులు, లక్ష్మి దంపతుల కుమారుడు శివ(9) తోటి చిన్నారులతో కలసి వీధిలో పడిపోయిన పాత ఇంట్లో కుక్క పిల్లలను తీసుకొని రావడం కోసం వెళ్లాడు. పాత ఇంటిపై వెళ్లిన కరెంటు తీగకు ఉన్న జీవైర్ కొన్నాళ్లుగా తెగిపోయి వేలాడుతూ ఉంది. దీనిని ఎవరూ సరిచేయలేదు. అయితే రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి కరెంటు తీగ తెగి జీవైర్‌కు విద్యుత్ ప్రసారం అయ్యింది. ఇది గమనించని చిన్నారులు లోపలికి వెళ్లారు. బాలుడు శివకు జీవైర్ భుజం దగ్గర తాకి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. తోటి పిల్లలు గమనించి ఏడుస్తూ బయటకు పరుగెత్తి వెళ్లారు. శివ కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగు వారు విషయం తెలుసుకొని విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేశారు. బాలుడు శివను తీసుకొని ఆస్పత్రికి వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఖైదీల సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు

నందికొట్కూరు: ఖైదీల సమస్యలు పరిష్కరిస్తామని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, కర్నూలు డిస్ట్రిక్ లీగల్ అథారిటీ చైర్మన్ ఎన్. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు పెట్టే భోజనం, మందుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్‌లో ఖైదీలు ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ లీలావెంకటశేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి శ్రీవిద్య, సబ్‌జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావు

పరిహారం చెల్లించాల్సిందే!

- బీమా సంస్థకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): ఆదోనికి చెందిన నభా కౌసర్ పవర్‌లూమ్, హ్యాండ్లూమ్స్ సంస్థలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదానికి బీమా సంస్థ పరిహారం చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ స్పష్టం చేసింది. పవర్‌లూమ్ యజమానికి రూ.7.50 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ సంస్థను ఆదేశించింది. అలాగే నష్టపరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.60 వెలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్ కుమార్, సభ్యులు ఎన్. నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న మేరకు ఆదోని పట్టణానికి చెందిన సభా కౌసర్.. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 2019లో రూ.25 లక్షలతో పవర్‌లూమ్, హ్యాండ్లూమ్స్ సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ నుంచి అగ్నిప్రమాదం లేదా ఇతర విపత్తులు సంభవిస్తే పరిహారం చెల్లించేలా రూ.15 లక్షలకు బీమా పాలసీ తీసుకున్నారు. 2020 అక్టోబర్ 30న కురిసిన భారీ వర్షాలతో సంస్థ ఆవరణలోకి భారీగా నీరు చేరింది. దీంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి మిషన్లు కాలిపోయాయి. ఇదే విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. పరిహారం చెల్లించాలని కోరుతూ సభా కౌసర్ బీమా సంస్థకు దరఖాస్తు చేసుకున్నారు.. అయితే ఇన్సూరెన్స్ కంపెనీ నియమించిన సర్వేయర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి రూ.1.75 లక్షల నష్టం మాత్రమే జరిగినట్లు నివేదిక సమర్పించారు. అలాగే ప్రమాదానికి వర్షాలు, షార్ట్ సర్క్యూట్ కారణం కాదని నివేదించారు. అన్ని ఆధారాలను పరిశీలించిన కమిషన్... పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థను ఆదేశించింది.

రూ.25 లక్షలు చెల్లించాలి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాల్సిందేనని ఆదిత్య బిర్లా బీమా సంస్థను వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. అలాగే పరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.50 వేలు చెల్లించాలని పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే... గూడూరు మండలానికి చెందిన మెడికల్ రిప్రెజెంటేటివ్ వి.ఓంప్రకాష్ 2021 నుంచి 2024 సంవత్సరం వరకు చెల్లుబాటు అయ్యేలా ఆదిత్య బిర్లా బీమా సంస్థలో రూ.25 లక్షలకు ప్రమాద బీమా పాలసీ తీసుకున్నారు. అదే ఏడాది అక్టోబర్ 4న ద్విచక్ర వాహనంపై మరో ఇద్దరు మిత్రులతో కలసి ఓంప్రకాష్ వస్తున్న సమయంలో అకస్మాత్తుగా పంది అడ్డం రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓంప్రకాష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అయితే ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం నిబంధనలకు విరుద్ధమంటూ బీమా మొత్తం ఇచ్చేందుకు ఆదిత్య బిర్లా సంస్థ నిరాకరించింది. అయితే ముగ్గురు ప్రయాణించడం వల్ల ప్రమాదం జరగలేదని, అకస్మాత్తుగా పంది రావడం వల్ల ప్రమాదం జరిగిందని, బీమా సంస్థ పరిహారం ఇవ్వాల్సిందేనని కమిషన్ తీర్పునిచ్చింది.

సుందరం సోయగం

ఆకాశమంతా నీలిరంగు అలుముకుంది. తెల్లటి శ్వేత వర్ణపు మేఘాలు ముగ్ధమనోహరంగా పురివిప్పుతూ కనిపించాయి. మహానంది ఆలయం వద్ద ఈ దృశ్యం శుక్రవారం కనువిందు చేసింది. ఆలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడు సైతం నింగి వైపు చూస్తూ ఆనందిస్తున్నట్లు కనిపించాడు. –మహానంది

